VISION BHARATH REPORTER
విభారె
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత నాలుగు సంవత్సరాల నుండి వెలువడుతున్న "విభారె" తెలుగు దిన పత్రికకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా అనుభవజ్ఞులైన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు వెంటనే సంప్రదించగలరు.
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్.
MOBILE: 9494498787,9440232308.

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 17-08-2023 సంపుటి : 04 సంచిక : 307 పేజీలు : 8 వెల : రూ 3-00

## డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వ్యక్తికి 04 రోజులు జైలు శిక్ష...

### జిల్లా ఎస్పీ .రఘువీర్ రెడ్డి




నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 16 విభారె న్యూస్ :- నంద్యాల జిల్లా ఎస్పీ కె .రఘువీర్ రెడ్డి ఆదేశాలమేరకు నంద్యాల ట్రాఫిక్ పోలీసులు నంద్యాల పట్టణంలోని ఆత్మకూరు బస్ స్టాండ్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ లో కె. నాగిరెడ్డి. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడగా మద్యం సేవించిన వ్యక్తిని స్వాధీనంలోనికి తీసుకొని స్పెషల్ రిపోర్ట్ ద్వారా నంద్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ ఇస్మాయిల్ ముందుహాజరు పరచగా సదరు మద్యం సేవించిన వ్యక్తిపై సీఐ గారు సెక్షన్ 185 ఎమ్ వి ఆక్టు . మేరకు కేసు నమోదు చేసి కోర్టు నందు చార్జి షీట్ దాఖలు చేసి ,గౌరవ నంద్యాల సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఆర్ . రామభూపాల్ రెడ్డి గారి ముందు హాజరుపరచగా సదరు గౌరవ జడ్జి గారు ముద్దాయికి 04 రోజులు జైలు శిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. .ఈ సందర్భంగా నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపిన, బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించిన, శాంతిభద్రతల విషయంలో ఆటంకం కలిగించిన, మహిళలను కించపరిచే విధంగా వారి గౌరవానికి భంగం కలిగించేలా ఎవరైనా ప్రవర్తించిన అట్టి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఎస్పీ చేతుల మీదుగా ఉత్తమ ప్రతిభ ప్రశంస పత్రం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ మురళి



కర్నూలు ఆగస్టు 16 విభారె న్యూస్.స్వాతంత్ర దినోత్సవంను పురస్కరించుకొని మంగళవారం నాడు జిల్లా లో పోలీస్ వృత్తిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన,పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ చేతుల మీదుగా అవార్డ్ లను అందజేశారు. అందులో భాగంగానే ఎస్ బి హెడ్ కానిస్టేబుల్ మురళి ఎస్పీచేతుల మీదుగా కమెండేషన్ ప్రశంసా పత్రం అందుకున్నారు. ఉత్తమ అవార్డు అందుకున్న హెడ్ కానిస్టేబుల్ మురళికి సహ ఉద్యోగులు, వారి యొక్క శ్రేయోభిలాషులు పలువురు అభినందించారు.

### వాజ్‌పేయ్‌కు నేతల

# ఘన నివాళి

న్యూఢిల్లీ,ఆగస్ట్16విభారె న్యూస్: దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ ఐదో వర్ధంతి సందర్భంగా ప్రముఖులు ఘన నివాళులు అర్పించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్,స్పీకర్ ఓం బిర్లా పలువురు ప్రముఖులు మాజీ ప్రధానికి పుష్పాంజలి ఘటించి స్మరించుకున్నారు. భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సహా పలువురు కేంద్ర మంత్రులు నివాళులు అర్పించారు. దిల్లీలోని వాజ్‌పేయీ స్మారకం 'సదైవ్ అటల్'కు తరలివెళ్లి.. ఆ మహానేత సేవలను స్మరించుకున్నారు. ఢిల్లీలోని వాజ్ పేయి స్మారకం సదైవ్ అటల్ దగ్గరకు చేరుకున్న నేతలు అటల్ బిహారీ వాజ్ పేయికి శ్రద్ధాంజలి ఘటించారు. అంతకుముందు వాజ్‌పేయీ స్మారకార్థం ఏర్పాటు చేసిన ప్రార్థనా



సమావేశంలో పాల్గొన్నారు. మాజీ ప్రధాన మంత్రి, బీజేపీ అగ్ర శ్రేణి నేత దివంగత అటల్ బిహారీ వాజ్‌పాయి నాయకత్వం వల్ల భారత దేశం గొప్ప ప్రయోజనం పొందిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వాజ్‌పాయి వర్ధంతి సందర్భంగా బుధవారం ఆయనకు నివాళులర్పించారు. భారత దేశ అభ్యున్నతిని పెంపొందించేందుకు వాజ్‌పాయి విశేష కృషి చేశారని తెలిపారు. అన్ని రంగాలనూ విస్తృత స్థాయిలో 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లడానికి ఆయన సేవలు దోహద పడ్డాయన్నారు. వాజ్‌పాయి వర్ధంతినాడు ఆయనకు నివాళులర్పిస్తున్న 140 కోట్లమంది భారతీయుల్లో తాను కూడా ఒకడినని మోదీ బుధవారం ట్వీట్ చేశారు. బీజేపీ నుంచిప్రధాన మంత్రి పదవిని చేపట్టిన తొలి నేత వాజ్‌పాయి. ఆయన పార్టీకి ప్రజాదరణ సాధించడంలో విజయం సాధించారు. ఆరేళ్లపాటు సంకీర్ణ ప్రభుత్వాన్ని విజయవంతంగా నిర్వహించారు.ˇ సదుపాయాలను అభివృద్ధి చేశారు. 2018 ఆగస్టు 16న 93 ఏళ్ల వయసులో పరమపదించారు.

## విశాఖ చేరుకున్న పవన్ కళ్యాణ్



విశాఖపట్టణం,ఆగస్ట్16( విభారె) గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో పవన్ కళ్యాణ్‌కు మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఘన స్వాగతం పలికారు. పంచకర్ల రమేష్ బాబు వెంట కోన తాతారావు, పీవీఎస్ రాజు, పసుపులేటి ఉషాకిరణ్, సుందరపు విజయ్ కుమార్‌తోపాటు పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఎయిర్ పోర్టు నుంచి షీలా నగర్ రోడ్డు మార్గంలో భీమిలి ఎర్ర మట్టి దిబ్బల వద్దకు పవన్ కల్యాణ్ వెళ్లనున్నారు.



### నేటి నుండి గాయత్రి మాత ఆలయంలో

## శ్రావణమాస పూజలు

### గాయత్రి మాత అమ్మవారు

ఆళ్లగడ్డ ప్రతినిది ఆగస్టు 16 విభారె న్యూస్ : స్థానిక గాయత్రి మాత ఆలయంలో నేటి నుండి శ్రావణమాస పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. ఆగస్టు 17 నుండి సెప్టెంబర్ 14 వరకు ఉదయము సాయంత్రం గాయత్రి మాత అమ్మవారికి విశేష పూజలు అభిషేకాలు బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఆగస్టు 26న శ్రావణ శుద్ధ దశమి సందర్భంగా ఉదయం అమ్మవారికి వార్షిక అభిషేకం, సాయంత్రం గ్రామోత్సవం జరుగుతుందన్నారు.



## కోట కందుకూరులో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ప్రచారం

### తెదేపా బలపరిచిన అభ్యర్థి నాగ శ్రీనివాసులు గెలిపించాలని ఇంటింటి ప్రచారం

### ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ



ఆళ్లగడ్డ ప్రతినిది ఆగస్టు 16 విభారె న్యూస్ : మండలంలోని గ్రామ సర్పంచ్ ఉప ఎన్నికను తెలుగుదేశం పార్టీ వైకాపాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఇరు పార్టీలు తమ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మాజీ మంత్రి భూమా అఖిలప్రియ తెదేపా బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి నాగ శ్రీనివాసులు గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆమెతోపాటు తెదేపా బలపరిచిన అభ్యర్థి నాగ శ్రీనివాసులు, తాలూకా టిడిపి నాయకులు భూమా జగద్విఖ్యాత్ రెడ్డి, భార్గవ్ రామ్, హైకోర్టు న్యాయవాది గోగిశెట్టి నరసింహారావులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి తాము బలపరిచిన అభ్యర్థి నాగ శ్రీనివాసులును గెలిపించాలని కోట కందుకూరు అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ భరోసా ఇస్తుందని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఓటర్లకు వివరించారు. పల్లసీమలో ప్రగతి పథంలో నడవాలంటే తెదేపా తోనే సాధ్యమని తెదేపాను గెలిపించాలని ఆమె ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి చాంద్. బాషా, కౌన్సిలర్ హుస్సేన్ భాష, తెదేపా నాయకులు నన్నే బై గారి జిలాని, శివారెడ్డి , రఘురామిరెడ్డి, పత్తి పాపిరెడ్డి, ఓబులంపల్లె రామకృష్ణారెడ్డి, నాగాంజి తదితరులు పాల్గొన్నారు.

# రెండవ దశ రీసర్వే పనులు పూర్తి చేయండి

### వీడియో కాన్ఫరెన్స్ లో అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్

నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 16 విభారె న్యూస్ :-జిల్లాలో చేపట్టిన రెండవ దశ రీసర్వే పనుల ప్రక్రియను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు, మండల తహసీల్దార్లను జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి రీసర్వే, అసైన్మెంట్ భూములు, భూసేకరణ, ఓటర్ల జాబితా సవరణ తదితర అంశాలపై ఆర్డీఓలు, అన్ని మండలాల తాసిల్దార్లు, ల్యాండ్ అండ్ సర్వే అధికారులతో వీడియో కన్ఫెరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండవ దశ రీ సర్వే పనుల పక్రియకు సంబంధించి 76 గ్రామాలకు గాను 23 గ్రామాలలో పూర్తయిందని, మిగిలిన 53 గ్రామాలలో ఆగస్టు 31వ తేదీ లోపు రీసర్వే ప్రక్రియ పూర్తి చేయాలని అన్ని మండలాల తాసిల్దార్లు, ల్యాండ్ అండ్ సర్వే అధికారులను ఆదేశించారు.జాతీయ రహదారి 340 సి కి సంబంధించి నందికొట్కూరు, జూపాడుబంగ్లా, పాములపాడు, ఆత్మకూరు మండలాల్లో పెండింగ్ ఉన్న 640 క్లైయిమ్ లను ఆర్డీవోలు, సంబంధిత మండల తాసీల్దార్లు నాలుగు రోజుల్లో పూర్తి చేసి పంపాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే 167 కేకు సంబంధించి కల్వకుర్తి నుండి నంద్యాల వరకు వెలుగోడు, ఆత్మకూరు,



బండి ఆత్మకూరు, కొత్తపల్లి, నంద్యాలలలో పెండింగ్ లో ఉన్న కేటగిరిజైషన్ ఆఫ్ ల్యాండ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి పంపాలని కలెక్టర్ ఆదేశించారు.ఇంటింటి ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి ఫార్మ్-6 కింద 7,261, ఫార్మ్-7 కింద 5,143, ఫార్మ్-8 కింద 20,574 క్లెయిమ్స్ పెండింగ్లో ఉన్నాయని.... ఇప్పటివరకు 63 శాతమే పూర్తయిందని మిగిలిన 37 శాతాన్ని ఈనెల 21వ తేదీలోగా వెరిఫికేషన్ పూర్తి చేసి ఓటర్ల జాబితాలో సవరించాలని ఈఆర్ఓ, ఎఈఆర్ఓ లను కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ పుల్లయ్య, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి హరికృష్ణ, కలెక్టరేట్ లోని సెక్షన్ల సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## అమావాస్య సందర్భంగా ఉరుకుంద క్షేత్రంలో పోటెత్తిన భక్తజనం!!!

కౌతాళం ఆగస్టు 16 విభారె న్యూస్.జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి (నరసింహ స్వామి) ఆలయంలో బుధవారం అమావాస్య సందర్భంగా భక్తజనం పోటెత్తారు.. ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుండి వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఉరుకుంద క్షేత్రం భక్తజనంతో నిండిపోయింది... తుంగభద్ర దిగువ కాలువలో పుణ్యస్నానాలు చేసిన భక్తులు,పిండి వంటలతో స్వామికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు.. ప్రత్యేక ,అతి శీఘ్ర క్యూలైన్లు అన్నీ కూడా భక్తులతో నిండిపోయాయి.. దీంతో స్వామి దర్శనానికి మూడు గంటలకు పైన సమయం పట్టింది.. అమావాస్యను



పురస్కరించుకొని స్వామికి ఆలయ అర్చకులు అభిషేకము,ఆకు పూజ, మహా మంగళారతి వంటి పూజలను శాస్త్రబద్ధంగా నిర్వహించారు... కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ నాగరాజు గౌడ్,ఆలయ ఈవో వాణి,పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.. భక్తుల కోసం ఆంధ్ర కర్ణాటక ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్ సర్వీసులను ఏర్పాటు చేశారు... ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తుని ఏర్పాటు చేశారు.

# సంపాదకీయం

గురువారం 17-08-2023

## ప్రధాన సమస్యలపై చిత్తశుద్దిలేని పాలకులు !

వచ్చే ఏడాది జరిగే స్వాతంత్ర్య ఉత్సవాల్లోనూ తానే త్రివర్ణ పతాకం ఎగురేస్తానని, మరోమారు ఆశీర్వ దించాలని ప్రధాని మోడీ చేసిన ప్రకటనపై విమర్శలు ఎలా ఉన్నా.....దేశాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలపై ప్రధాని మోడీ ఎక్కడా తన ప్రసంగంలో ప్రకటించలేదు. దేశం ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలపై ప్రస్తావనా లేదు. ఉత్తరాదిలో అతలాకుతలం చేసిన వరదలు, కొండచరియలు విరిగి పోవడం, మణిపూర్‌లో ఊచకోతలు, ధరల పెరుగుదల,నిరుద్యోగం, ఆర్థికమాంద్యం కోసం తీసుకునే చర్యల గురించి ప్రస్తావించ లేదు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రధాని మోదీ మాట్లాడుతూ ప్రస్తావించిన అంశాలు ఏవీ అమలుకాలేదు. ఇప్పుడు కొత్తగా మరో 25 ఏళ్ల దార్శనికత గురించి చెబితే ప్రజలు నమ్ముతారా అన్నది ఆలోచించడం లేదు. ధరల పెరుగుదల, రూపాయి పతనం, నిరుద్యోగం, ఆర్థిక మాంద్యం ఇప్పుడు దేశాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. దేశ ఆర్థికవ్యవస్థ దెబ్బతింటోందన్న ఆర్థిక నిపుణుల హెచ్చరికలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక కావాలి. ప్రధాని మోదీ ఈ విషయాలపై ఎక్కడా మాట్లాడడం లేదు. ఎర్రకోట ప్రసంగంలోనూ వీటి గురించి ప్రస్తావించలేదు. వీటిని ఎలా అధిగమించ బోతున్నారో కూడా చెప్పలేదు. గతంలో చెప్పిన వాగ్దానాలేవీ అమలుకాలేదు. తన ప్రభుత్వం సాధించిన విజయాలను,చేపట్టిన సంక్షేమ పథకాలను, సంస్కరణలను ఎంతగొప్పగా చెప్పినా పొయ్యిలో పిల్లి లేవని కుటుంబాలు కోకొల్లలు. ఇన్ని చెప్పిన ప్రధాని మోడీ మన రూపాయికి శస్త్రచికిత్స చేసే విషయాన్ని మరచి పోయారు. రూపాయి రోజురోజుకూ చిక్కి శల్యమవుతున్నా ప్రస్తావించడంలేదు. రూపాయి విలువ పెరగ లేదు సరికదా మరింత దిగజారుతున్నా పట్టుకుని నిలపాలన్న తపన కానరావడం లేదు. కనీసం దానిని తాను అధికారం చేపట్టిన నాటి స్థాయికి తీసుకుని వద్దామన్న ప్రయత్నం కూడా జరగడం లేదు. ఈ మాంద్యాన్ని గమనించి అడుగులు వేద్దామన్న చిత్తశుద్ది కానరావడం లేదు.అందుకే మోడీ ఎర్రకోట ప్రసంగం పై ఎక్కడా ఆసక్తి గానీ, ఆయన పిలుపుపై స్పందన గానీ కానరావడం లేదు. ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు, విదేశాల నుంచి నల్లధనాన్ని వెనక్కి రప్పించడం వంటి తొలినాళ్ల హామీలను ఇప్పుడు ఎక్కడా ప్రస్తావించడం లేదు. దేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో నిరుద్యోగంపైనా ప్రధాని పెదవి విప్పడంలేదు. ఇలా సమస్యలు వెన్నాడుతున్నా.. ప్రజలను పట్టించుకోకుండా రానున్న ఏడాది తానే మళ్లీ జెండా ఎగురేస్తానని చెప్పడం ద్వారా మరోమారు వంచించడం తప్ప మరోటి కాదు. వంచనలతో పాలన చేయలేమని మోడీతో పాటు,రాష్ట్రాల సిఎంలు కూడా గుర్తించాలి. నిరుద్యోగం,ద్రవ్యోల్బణం, జీఎస్టీలతో నిలువుదోపిడి చేస్తున్న తీరుపై స్పష్టత లేకుండా ఎంతకాలం మోసం చేస్తారు. అచ్చేదిన్ వాగ్దానం చేసి మరచిపోతే ఎలా అన్నది మోడీ గుర్తు చేసుకోవాలి. పాలకులు తాముచేసిన వాగ్దానాలపై కసరత్తు చేయ కుండా మరింతగా ప్రజలను మభ్యపెడుతూ పోతే ఎలా అన్నది మననం చేసుకోవాలి. సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్.. అమృత్ కాల్, ఆజాదీకా అమృత్ మహోత్సవం ఇలా నినాదాలతో ప్రజల కడపులు నిండవని గుర్తించాలి. అవరోధాలను, అవకాశాలను పారదర్శకంగా చర్చించి, భవిష్యత్ మార్గాన్ని సూచించడం విజ్ఞత అవుతుంది. కానీ సమస్యలను ముందు పెట్టుకుని వాటిని లేనట్లుగా చూపడం మోసం అవుతుంది. దేశ ఆర్థిక పరిస్థితి గతంలో ఓమారు దిగజారిన వేళ అప్పట్లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన పివి నరసింహారావు నడుం బిగించి చక్కదిద్ది, ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. పడిపోతున్న రూపాయిని పట్టుకుని లేపారు. విదేశీమారక నిల్వలను నిలబెట్టారు. ఇప్పుడలాంటి చొరవ కానీ, దక్షత కానీ పాలకులుకు లేకుండా పోయింది. కనీసం ఎందరికో భారతరత్నలు ఇస్తున్న ప్రభుత్వం పివి దార్శనికతను గుర్తించి..ఆయనను గౌరవించక పోవడం దారుణంకాక మరోటి కాదు. కనీసం ఆయన చూపిన దక్షతనయినా పునికిపుచ్చుకోవడం లేదు. అనుత్పాదక రంగాలకు నిధులను వేలం వెర్రిగా ఖర్చు చేస్తూ పోవడం, దిగుమతులు పెంచడం వంటి చర్యలు దేశీయంగా ఆర్థికరంగాన్ని దెబ్బతీస్తూ వస్తోంది. ఉచిత పథకాలకు మంగళం పాడాల్సింది పోయి వాటిని పెంచుతున్నారు. ఈ విషయంలో రాష్ట్రాలు విచ్చలవిడిగా నిధులను దుర్వినియోగం చేస్తున్నాయి. దీనిని అర్థం చేసుకోని నేతల కారణంగా ఆర్థిక వ్యవస్థ దెబ్బతిం టోంది. తాజాగా మరోమారు ఇలాంటి భయాలు వస్తున్న వేళ కేంద్రం దిద్దుబాటు చర్యలు పూనుకోకుండా నినాదాలకే పరిమితం కావడం ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యం కాక మరోటి కాదు. ప్రజలు, పరిశ్రమలు, ప్రభుత్వం ఎక్కువ మొత్తాలను పొదుపు చేసి, ఆ నిధులను పెట్టుబడులుగా ఉపయోగించి, వస్తుసేవల ఉత్పత్తినీ, ఎగుమతులనూ వృద్ధి చేసినప్పుడు మాత్రమే స్థిరమైన ప్రగతిని సాధించగలం. దిగుమతులను తగ్గిస్తూ పోతూ, ఎగుమతలుపై దృష్టి పెట్టాలి. అనవసర వస్తువులను అదేపనిగా దిగుమతి చేసుకోవడం తగ్గించాలి. ఇబ్బడిముబ్బడిగా ప్రపంచ మార్కెట్ మనపై పెత్తనం చేయకుండా చూసుకోవాలి. ఇవన్నీ మరచి ప్రకటనలతో ప్రజలను మభ్యపెడుతూ పోతే ఎంతకాలం అయినా భారత్ పురోగతి సాధించదు. నదుల అనుసంధానం, విద్యుత్ ఉత్పత్తి, ఆహారాధాన్యలు పేదలకు చేర్చడం వంటి విషయాల్లో స్పష్టత రావాలి. నదీజలాలలు పొలాలకు మళ్లించే పథకాలు చేపట్టాలి. నదుల అనుసంధానం వంటి విషయాలను ప్రధాని మోడీ అస్సలు చర్చించడం లేదు. ఇలా 9 ఏళ్లు గడిచాయి. నిజానికి చిత్తశుద్దితో కృషి చేసివుంటే ఈ దశాబ్ద కాలం సరిపోయేది. ఇవన్నీ చర్చించకుండా...ప్రజలకు చెప్పకుండా మరోమారు తనదే అధికారం అంటూ ప్రకటన చేయడం దారుణం కాక మరోటి కాదు.

# ఏఐఎస్ఎఫ్ కర్నూల్ జిల్లా నిర్మాణ మహాసభలను జయప్రదం చేయండి -ఏఐఎస్ఎఫ్




కోసిగి, ఆగస్టు 16 (విభారె న్యూస్) ఈనెల 25వ తేది కర్నూలు నగరంలోని ఎస్ టి యు భవన్ లో జరిగే ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ మహాసభలను జయప్రదం చేయాలని బుదవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు కరపత్రాలు ఏఐఎస్ఎఫ్ నాయకులు విడుదల చేశారు ఈ సంధర్భంగా ఏఐఎస్ఎఫ్ మంత్రాలయం తాలూకా అధ్యక్షుడు ఎస్. ఈరేష్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాల కొరకు పోరాటాలకు విద్యార్థులను సంసిద్ధం చేయడం జరుగుతుంది. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ భావజాలంతో జాతీయ నూతన విద్యా విధానాన్ని అమలులోకి తీసుకొని వచ్చింది. జాతీయ నూతన విద్యా విధానం వలన పేద మధ్య బడుగు బలహీన అనుగారిన వర్గాల విద్యార్థులకు విద్య అందని ద్రాక్ష వలె మారుతుంది. విద్యార్థులకు స్ఫూర్తి అయిన పూలే భగత్ సింగ్ అంబేద్కర్ కెరియర్ నారాయణ గురు వంటి వారి జీవిత చరిత్రలను మరియు దారి సిద్ధాంతాలను పాఠ్యాంశాల నుండి తొలగించి బ్రిటిష్ వారికి తొత్తుగా వ్యవహరించిన సావర్కర్ జీవిత చరిత్రను చేర్చి దేశ చరిత్రను వక్రీకరిస్తున్నారు బాల్యం నుంచే విద్యార్థుల మెదడులోకి మతతత్వ భావజాలాన్ని నింపుతున్నారు జాతీయ నూతన విద్యా విధానం రద్దుకై పోరాటాలకు సిద్ధం అవ్వాలి. కేంద్ర ప్రభుత్వం యూనివర్సిటీలకు నిధులు కల్పించడంలో పూర్తిగా విఫ్లమైంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు దమ్ము ధైర్యం ఉంటే విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి. అప్పుడే విద్యావ్యవస్థ మెరుగవుతుంది. పేద విద్యార్థులకు ప్రభుత్వ విద్య అందుతుంది. డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి పేద విద్యార్థులకు విద్యను దగ్గర చేస్తే ఆయన తనయుడు జగన్మోహన్ రెడ్డి పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే చట్టాలు తీసుకొస్తున్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా జీవో నెంబర్ 107 108 తీసుకొని వచ్చి మెడికల్ విద్యార్థుల పాలిట శాపంగా మారారు. జీవో నెంబర్ 77 తీసుకుని వచ్చి పీజీ విద్యార్థులకు పై చదువులు దూరం చేశారు. అమ్మబడి జగనన్న వసతి దీవెన విద్యా దీవెన అంటూ విద్యార్థులను విద్యార్థుల తల్లిదండ్రులు మోసం చేస్తున్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, స్కాలర్షిప్లు మౌలిక వస్తువులు కల్పించడంలో పూర్తిగా విఫలం చెందారు. నాడు నేడు పేరుతో పాఠశాలలో అభివృద్ధి పేరుతో దోచుకుంటున్న వైసిపి నాయకులు. మెగా డీఎస్సీ నిర్వహించకపోవడం. యూనివర్సిటీలో టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయకపోవడం. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టల్లో మౌలిక వసతులు కల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. డిగ్రీని పాత పద్ధతిలో నిర్వహించాలన్న డిమాండు. చేశారు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణకు చట్టం తీసుకొని రావాలి. రాష్ట్ర ప్రభుత్వం విద్య ఉపాధిలో పూర్తిగా విఫలమైంది. రానున్న రోజుల్లో దీన్ని ఎండగడుతూ భవిష్యత్తు కార్యచరణ కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు నరసింహులు,మల్లికార్జున,అశోక్,లక్ష్మన్న,ఖాదర్,తరుణ్, రాంప్రషాద్ సొంశేఖర్, విజయ్ బాలాజీ,తదిత నాయకులు పాల్గొన్నారు

# జిఎస్టీ వాయింపులపై ఎవరు చర్చించాలి

**ఈ భారాలపై ఎక్కడ మొర పెట్టుకోవాలి**

**ఇన్సూరెన్స్‌లపై జిఎస్టీ విధించడం దారుణం**

న్యూఢిల్లీ,ఆగస్ట్16 భారత్ లాంటి దేశాల్లో పన్నులు సరళీకృతంగా ఉండాలి. ఒకే పన్ను విధానం అంటూ జిఎస్టీని తీసుకుని వచ్చినా పన్నుల భారాలపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించడం లేదు. ప్రతి పనికి జిఎస్టీని విధించడం దారుణం కాక మరోటి కాదు. హెల్త్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్, బీమా మొత్తాలపై జిఎస్టీ విధించడం దారుణం కాక మరోటి కాదు. పెట్రో ధరలపై జిఎస్టీ విధించడం లేదు. గ్యాస్ ధరలు ఇబ్బడిముబ్బడిగా పెంచేశారు. ప్రజలు కడుతున్న పన్నులతో పాలకులు రాజ్యాలు ఏలుతున్నారు. తమ సుఖాలకు ఖర్చు చేస్తున్నారు. పథకాల పేరుతో వంచన చేస్తున్నారు. నిజానికి జీఎస్టీని 28 నుంచి 5 శాతానికి పరిమితం చేయాలి. పన్నుల పేరుతో ఎలా బాదుతున్నారో చర్చించాలి. రకరకాల పన్నులపై చర్చించాలి. అవసరమైతే పార్లమెంటులో ప్రత్యేకంగా చర్చించే ధైర్యం చేయాలి. బ్యాంకుల రుణ వితరణలో లక్ష కోట్ల రూపాయల తరుగుదల కనిపించిందని రిజర్వుబ్యాంకు వెల్లడించడం గమనిస్తే, గిరాకీ మందగించడం వల్లనే కొత్త పరిశ్రమలు, వ్యాపారాలను పెట్టడానికి రుణాలు తీసుకునేవారు కరవవుతు న్నారని స్పష్టమవుతుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తరచూ మాంద్యానికి గురవు తూనే ఉంటుంది. అది సహజ పరిణామం కూడా. ఆర్థిక మాంద్యాన్ని అధిగమించడానికి అమెరికా, బ్రిటన్, జర్మనీ వంటి దేశాలు ఒక సరళ సూత్రాన్ని పాటించి విజయం సాధించాయి. భారత్ కూడా అలాంటి ఉద్దీపన విధానాన్ని చేపట్టాలి. కొన్ని రంగాలు తమ సామర్థ్యం మేరకు ఉత్పత్తి సాగించలేక పోయాయి. ప్రభుత్వం తన వ్యయాన్ని పెంచితే ఆర్థిక వ్యవస్థలోకి ధన ప్రవాహం, దానితోపాటే గిరాకీ పెరిగి, పరిశ్రమలు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత ఎక్కువగా వినియోగించుకుంటాయి. దీనికి ఉద్దీపనలు ఇవ్వాలే తప్ప కొందరు కార్పోరేట్లకు రుణాలను మాఫీచేయడం, ఎగవేతదారుల రుణాలను మాఫీ చేయడం దేశ అభివృద్ధి కాదు. అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబడే భాగ్యం కలిగిందని సంతోషపడుతున్న వేళ రూపాయితో పోల్చుకుంటే మనం ఎప్పటికీ బలహీనంగానే ఉంటున్నాం. బలహీన దేశాలైన సూడాన్ లాంటి దేశాల్లో మాత్రమే మనం బలవంతులం. 77ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవాలు జరుపుకుంటున్న వేళ వెనక్కి తిరిగి చూస్తే మన ఆర్థిక ప్రగతి బలపడిందా లేక బలహీన పడిందా అన్నది రూపాయిని అడిగితే చెబుతుంది. ప్రధానంగా మనం రూపాయిని డాలర్‌తో పోలిస్తేనే మన బలం గురించి తెలుస్తుంది. డాలర్ మనకు పాలకులు మాత్రం ఘనంగా అభివృద్ధి గురించి ఢంకా బజాయిస్తున్నారు. అంతెందుకు నోట్ల రద్దు జరగక ముందు ఉన్న 500 రూపాయల విలువ ఇప్పుడు కొత్త రెండు వేల నోటుకు లేదంటే నమ్మగలమా? కానీ నమ్మాలి. ఆనాటి 500 నోటు ఇవాల్టి రెండు వేల నోటు ఒకటే అన్న సంగతి బజారులో అడుగుపెడితే సామాన్యుడే చెబుతాడు.

# వైకాపాను మళ్లీ అధికారంలోకి తెచ్చే బాధ్యత మీదే

**ఎమ్మెల్యే గంగుల నానిసమావేశంలో**



**మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల నాని**

ఆళ్లగడ్డ ప్రతినిది ఆగస్టు 16 విభారె న్యూస్ : వైకాపాను మరలా అధికారంలోకి తీసుకొని వచ్చే బాధ్యత ప్రతి కన్వీనర్ తీసుకోవాలని శాసనసభ్యులు గంగుల నాని అన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో జేసీఎస్ సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గం నుంచి పలు మండలాల కన్వీనర్లు ఈ సమావేశంలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల నాని మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గ వ్యాప్తంగా మనం అందరం ఒకటే కుటుంబం అని ప్రతి ఒక్కరం ఇప్పటినుండి కష్టపడి పనిచేసి పార్టీని అధికారంలోకి తెచ్చుకునే బాధ్యతగా ప్రతి కన్వీనర్ తీసుకోవాలన్నారు. ఆరోగ్య భీమా నమోదు కార్యక్రమాన్ని రేపటినుండి మీ పరిధిలోని గృహ సారధుల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని కన్వీనర్లను ఆయన సూచించారు. వైకాపాను అధికారంలోకి తెచ్చేందుకు ప్రతి కార్యకర్త శ్రమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి తో వైకాపా నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

# రూపాయికి శస్త్ర చికిత్స చేయాల్సిందే

## దిగుమతుల భారం తగ్గితేనే సత్ఫలితాలు

## కేంద్రం నిర్ణయాల కోసం ప్రజల ఎదురుచూపు

ముంబై,ఆగస్టు16 ): రిజర్వు బ్యాంకు గణాంకాల ప్రకారం 2014 ఆగస్టు 14న డాలర్‌కు 61.05 పైసలు. ఈ తొమ్మిదేళ్లలో అది ఇప్పుడు రూ.83కి చేరుకుంది. ఇదొక్కటి చాలు మనమెంతగా ఆర్థికంగా చితికి పోయామో చెప్పడానికి. రూపాయి బలపడిందంటే మన ఎగుమతులు పెరిగాయని అర్థం చేసుకో వచ్చు. దీనివల్ల మన విదేశీ మారక నిల్వలు హరించుకు పోతున్నాయి. ఇదంతా కేవలం దిగుమతుల ప్రభావం అనడంలో ఎలాంటి సందేహం లేదు. మోడీ సాధించిన ఆర్థిక ప్రగతి ఎలా ఉన్నా రూపాయిని మాత్రం పట్టుకోలేకపోతున్నారు. నిజంగా రూపాయికి శస్త్రచికిత్స చేసే కార్యాక్రమాలు కానరావడం లేదు. మనవాళ్లను అమెరికా పంపించాలంటేనే భయం వెన్నాడుతోంది. చదువుకునేందుకు వెళ్లే పిల్లలకు రూపాయలను బస్తాల్లో పంపినా అక్కడ పిడికెడు డాలర్లు రావడం లేదని వాపోతున్నారు. 76 ఏళ్ల స్వాతంత్ర్య చరిత్రలో ఎన్నడూ లేనంత కనిష్ట స్థాయికి దిగజారిపోయి రూపాయి విలపిస్తుండగా, నిత్యావ సరాల ధరలు పెరిగి, ఆర్థిక వ్యవస్థ కుదేలవుతున్న తీరు ఎక్కడా ప్రధాని మోడీ ప్రసంగంలో కానరావడం లేదు. 1947లో రూపాయి విలువ డాలర్‌తో సమానం. అంటే ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతావనిలో మనం బాగా అభివృద్ధి సాధించామని ఈ రకంగా పోల్చుకోవాలేమో. డాలర్‌తో రూపాయి మారకం దారుణంగా మారింది. అమెరికా, టర్కీల మధ్య తలెత్తిన విభేదాల నేపథ్యంలో టర్కీ కరెన్సీ అయిన లిరా ఒడిదుడుకుల కు గురికావడంతోనే ఇంతటి పెను మార్పులని అప్పట్లో ఆర్థికమంత్రిగా ఉన్న అరుణ్ జైట్లీ సెలవిచ్చారు. అంటే ప్రపంచంలో ఏ దేశంలో ఏ ఉపద్రవం వచ్చినా మన రూపాయి తట్టుకుని నిలబడేంత బలంగా లేదు. ఇంతటి బలహీనమైన రూపాయి ఎప్పుడు బలపడుతుందా అన్నదే అనుమానం. సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలు వచ్చాక ద్రవ్యమారక రేట్లతో ప్రజా జీవనం తీవ్రంగా ప్రభావితమవుతోంది. ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైన చమురు ధరలకు నిర్ణయాత్మకమవుతోంది. రూపాయి మారకం విలువ పడిపోతోందని 2014 ఎన్నికలకు ముందు మోడీ కాంగ్రెస్‌ను తీవ్రంగా విమర్శిస్తూ వచ్చారు. ఇప్పుడు మోడీ ఆయుష్మాన్ భారత్ ప్రకటించారు. అయితే రూపాయికి శస్త్రచికిత్స చేయకుండా దీనిని సాధించడం దుస్సాధ్యం. ఇది సాధిస్తే ప్రజలు ఎవరికి వారు ఆర్థికంగా ఎదగలరు. ఎవరి ఆరోగ్యం వారు చూసుకోగలరు. దివంగత ప్రధాని పివి నరసింహారావు మాత్రమే ఇలాంటి దార్శనికతను ప్రదర్శించారు. ఆయన తీసుకున్న సాహసోపేత సంస్కరణలే ఇప్పటికీ మనకు రక్షగా నిలిచాయి. ప్రధాని మోడీ ఇప్పుడు ఈ దిశగా దృష్టి సారించాలి. కఠిన పరిశ్రమ చేయాలి. పివి-మన్మోహన్ ద్వయం తెచ్చిన ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంకు ఆదేశిత ఆర్థిక విధానాలనే వాజ్‌పేయ్ ప్రభుత్వం అమలు చేసింది. అలాగే మన్మోహన్ సర్కారు బాటలోనే మోదీ ప్రభుత్వం నడుస్తోంది. కాబట్టి ఆ పార్టీలు పరస్పరం విమర్శించుకోవడం రాజకీయ ప్రయోజనాల కోసమే తప్ప నిజంగా మాత్రం కాదు. రిజర్వు బ్యాంకు రంగంలోకి దిగి రూపాయిని నిలబెట్టాల్సిఉందని చాలామంది సూచిస్తున్నారు. 80శాతం చమురు ఎలాగూ దిగుమతి చేసుకొనేదే కనుక, క్రూడాయిల్ ధర పెరిగి, దేశీయ మార్కెట్‌లో పెట్రో ఉత్పత్తుల రేట్లు మరింత హెచ్చి నిత్యావసర, వినియోగ వస్తువులు ఖరీదు కాక తప్పదు. ఉక్రెయిన్ యుద్దంతో చమురు లభ్యత మరింత తగ్గి కొత్త కష్టాలు తెచ్చిపెట్టిందన్న ఆందోళనా ఉంది. ద్రవ్యోల్బణం అదుపు చేయడానికి ఆర్‌బిఐ కష్టాలు పడుతున్న తరుణంలోనే రూపాయి మరింతగా కృశించి పోతున్నది. రూపాయిని కాపాడటానికి రిజర్వుబ్యాంకు వద్ద అనేక మార్గాలు ఉండివుంటాయని, తగిన సమయంలో నిర్ణయాలు చేస్తుందని ఆర్థిక నిపుణులు హామీ ఇస్తున్నప్పటికీ, ఈ దుస్థితి ఎంతకాలం కొనసాగుతుందన్నది అర్థంకాని ప్రశ్న. రిజర్వుబ్యాంకు చర్యలు సామాన్యుడికి ఉపశమనం ఇవ్వలేని కాలం కూడా దాపురించవచ్చు. రూపాయి బలహీనతలను గుర్తించి తగు శస్త్ర చికిత్సలకు దిగాలి. లేకుంటే ఆర్థిక ద్రవ్యోల్బణం,ధరల స్వారీ పెరగగలదు. పెద్దనోట్ల రద్దు వంటిచర్యల కారణంగానే ఆర్థిక సంక్షోభం ఉత్పన్న మైందన్న వాదన ఇప్పటికీ ఉంది. ఎందుకంటే ఆనాటి నుంచి నేటి వరకు ఆర్థికరంగం తిరోమనంలోనే ఉంది. తన అధికారాన్ని దుర్వినియోగ పరుస్తూ మోదీ ప్రభుత్వం రిజర్వుబ్యాంకును నోరులేని దానిగా మార్చి వేసిందని విపక్షాలు అంటున్నాయి. ఆర్థిక రంగంలో కొత్త ఉత్పాతాలను తట్టుకొని నిలబడగల స్థితిలో ప్రజలు లేరు. ద్రవ్యోల్బణం అదుపు తప్పితే మరిన్ని కష్టాలు తప్పవు. బ్యాంకు వడ్డీరేట్లు పెరగడం, రుణాలమీద ప్రభావం వంటి సమస్యలు కూడా అనేకం. రూపాయి పతనమవుతున్నందున పెట్టుబడిదారులు డాలర్ సురక్షిత మైనదిగా భావించడంతో విదేశీ మారకద్రవ్య నిల్వలు కూడా తరిగి పోతున్నాయి. డాలర్ విలువ కారణంగా వాణిజ్యలోటు హెచ్చుతూ ఐదేళ్ళ గరిష్టానికి చేరింది. రూపాయి విలువ తగ్గుదలతో ఎగుమతులకు మేలు జరగవచ్చని కొందరంటున్నారు. అయితే ఇప్పటికే అమెరికా, ఐరోపా మార్కెట్లలో విధించిన నిబంధనలవల్ల వాటికి ముప్పు ఏర్పడిన వాస్తవాన్ని విస్మరించరాదు. అంతేగాక దిగుమతుల భారం వల్ల ఆర్థిక వ్యవస్థకు కలిగే నష్టాన్ని గుర్తించాలి. డాలర్లు మన దేశం నుంచి తరలి పోకుండా పరిమితం చేయడానికి విలాస వస్తువుల విచ్చలవిడి దిగుమతులపై ఆంక్షలు విధించడం అవసరం అన్న భావనా ఉంది. దేశ ప్రజల కొనుగోలు శక్తిని పెంచే ఆర్థిక విధానాల వైపు ఇప్పటికైనా మళ్లాల్సి ఉంది.భారతీయ రిజర్వుబ్యాంకు జోక్యం పూర్తిస్థాయిలో లేనందునే రూపాయి ఇంతగా ఉన్నదని కొందరి వాదన. రూపాయి పతనం ఐటీ, ఎగుమతులు కానీ, సామాన్యుడిపై ధరాఘాతం తప్పడం లేదు. దిగుమతి చేసుకొనే ఉత్పత్తుల ధరలు పెరిగిపోతున్నాయి. ఎగుమతులు, దిగుమతులను విశ్లేషించాలి. తాము తీసుకుంటున్న నిర్ణయాలు ఫలితం ఇవ్వడం లేదని గుర్తించి అందుకు కారణాలు విశ్లేషించాలి. చమురు దిగుమతులే మన కొంప ముంచుతున్నాయని ఆర్థికవేత్తలతో సహా ప్రభుత్వాలు కూడా అంటున్నాయి. విపరీతంగా పెరిగిన చమురు ధరల కారణంగా మన విదేశీ మారక ద్రవ్య నిల్వలు కరగి పోతున్నాయి.

# నిరుపేదలకు ఇంటి స్థలం కోసం ఎమ్మెల్యే ఇంటి ముందు ఆందోళన

## సిపిఐ జిల్లా నాయకులు



నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 16 విభారె న్యూస్ :-నంద్యాల పట్టణ జనాభా రెండు లక్షలు దాటింది. పట్టణంలో అధిక సంఖ్యలో ముస్లిం దళితులు బాడుగల ఇంటి లో నివాసముంటున్నారు. , రాష్ట్ర ముఖ్యమంత్రి ఇంటి స్థలం లేని నిరుపేదలు ఉండకూడదని పదె పదె చెప్తున్నారు. నంద్యాల పట్టణంలో వాలంటీర్ల ద్వారా 13,500 మందిని గుర్తించారు. వారికి పట్టాలు మంజూరు చేయలేదన్నారు . ప్రభుత్వం ఏర్పడి నాలుగు సంవత్సరాల మూడు నెలలు కావస్తున్న పేదలు ఉండటానికి స్థలాలు లేవన్నారు , బుధవారం సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమం ద్వారా నిరుపేదలకు ఇంటి స్థలం కోసం అప్లికేషన్లు పట్టుకొని టేక్కే మార్కెట్ యార్డ్ నుండి లబ్ధిదారులు 500 మందితో ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఇంటి ముందు కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమానికి సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ అధ్యక్షతన వహించి నడిపించారు. ఈ నిరసన కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఏ సుబ్బరాయుడు సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి జి సోమన్న ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు అధ్యక్షులు భూమిని శ్రీనివాసులు జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ గోసు పాడు మండల కార్యదర్శి హరినాథ్ సహాయ కార్యదర్శి గోకారి పాల్గొన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో ఇచ్చిన అర్జీలను గుర్తించి అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో సిపిఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు.

# బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) కర్నూలు జిల్లా బి.రాజ్ కుమార్, పి.కరుణకర్ లతోపాటు మరికొందరిని బిఎస్పి నుండి శాశ్వతంగా తొలగింపు

కర్నూలు, ఆగష్టు 16 విభారె న్యూస్ : పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ తేదీ 28-7-2023 న ఢిల్లీలోని బీఎస్పీ సెంట్రల్ ఆఫీసు గేటు వద్ద ప్రదర్శనలో పాల్గొన్న బి.రాజ్ కుమార్ మరియు పి. కరుణాకర్ లతో పాటు మరికొందరిని బహుజన్ సమాజ్ పార్టీ సెంట్రల్ కమిటీ ఆదేశాల మేరకు బిఎస్పి నుండి శాశ్వతంగా తొలగించినట్లు బిఎస్పి రాష్ట్ర అధ్యక్షులు బక్క పరంజ్యోతి 15/08/2023 న ప్రకటించినట్లు బహుజన్ సమాజ్ పార్టీ కర్నూలు జిల్లా ఇన్చార్జి బోగ్గుల వనమన్న, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు జై రాజ్ లు తెలిపారు. బుధవారము కర్నూలు పట్టణంలోని స్థానిక ఉల్చాల రోడ్డు నందు ఉన్న బిఎస్పీ జిల్లా కార్యాలయం నందు జిల్లా అధ్యక్షులు జై రాజ్ అధ్యక్షతన పార్టీ కార్యకర్తల విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జ్ బి.వనమన్న జిల్లా అధ్యక్షులు జై రాజ్ లు మాట్లాడుతూ బి. రాజ్ కుమార్ మరియు పీ.కరుణాకర్ లను మరియు మరికొందరు గత అనేక కాలం నుండి పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతూ మనువాద బిజెపి మరియు ఇతర పార్టీలకి తొత్తులుగా మారి బిఎస్పీ పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించడమే కాకుండా గత నెలలో 28-7-2023న ఢిల్లీలోని పార్టీ సెంట్రల్ ఆఫీస్ గేటు దగ్గర పార్టీకి వ్యతిరేకంగా ప్రదర్శనలో పాల్గొనడంతో పార్టీ సెంట్రల్ కమిటీ ఆదేశాల మేరకు బిఎస్పీ



రాష్ట్ర అధ్యక్షుడు బక్క పరంజ్యోతి తేదీ 15-8-2023న బి.రాజ్ కుమార్ అలియాస్ పసేద్దుల రాజు కుమార్ మరియు పీ.కరుణాకర్ లతో పాటు మరికొందరిని పార్టీ నుండి శాశ్వతంగా తొలగించారని వారు పేర్కొన్నారు. అదేవిధంగా పార్టీ నుండి శాశ్వతంగా తొలగించిన బి.రాజ్ కుమార్ మరియు పీ.కరుణాకర్లకు సహకరించిన వారిని కూడా భవిష్యత్తులో పార్టీ క్రమశిక్షణ చర్యల క్రింద చర్యలు తీసుకుంటున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి ప్రకటించడం జరిగిందని వారు పేర్కొన్నారు. కావున పార్టీ




కార్యకర్తలు నాయకులు అధికారులు ప్రజాప్రతినిధులు పార్టీ శ్రేయోభిలాషులు పార్టీ నుండి తొలగించబడిన బి.రాజ్ కుమార్,పి.కరుణాకర్లతో పాటు వారికి సహకరించిన వారిపై అప్రమత్తంగా ఉండాలని ఇకపై వారి నుండి జరిగే ఎటువంటి పరిణామాలకైనా బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్పీ) పార్టీకి సంబంధం ఉండదని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జి. సామెలు, ప్రధాన కార్యదర్శి డి. యర్రన్న, కోశాధికారి సలీం భాష, కార్యవర్గ సభ్యులు వై.నాగేష్, ఎమ్మిగనూరు అసెంబ్లీ అధ్యక్షులు ఎ.నాగరాజ్, ఆలూరు అసెంబ్లీ అధ్యక్షులు హెచ్. రామలింగయ్య, ఆదోని అసెంబ్లీ అధ్యక్షులు ప్రేమ్ కుమార్, పత్తికొండ అసెంబ్లీ అధ్యక్షులు జె. మధు శేఖర్, కోడుమూరు అసెంబ్లీ నాయకులు చిన్న గిడ్డయ్య, మంత్రాలయం అసెంబ్లీ అధ్యక్షులు జె.మోహన్, మిగతా అసెంబ్లీ నాయకులు అంద్రి బంగారప్ప,గర్జి ప్రసాద్,ఈరేష్, హనుమన్న,లక్ష్మన్న,గంగన్న, దీవన్,విజయ్ మరియు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# ఎమ్మిగనూరు లో ఈ ఏడాది 5 రోజులు కొలువుదీరనున్న గణనాథుడు.



ఎమ్మిగనూరు ఆగష్టు 16 విభారె న్యూస్.వినాయక చవితి ని పురస్కరించుకొని ఎమ్మిగనూరులో ప్రతి సంవత్సరం ఏర్పాటు చేసే వినాయక మండపాలు 3 రోజులు మాత్రమే ఉండేవి. మండప నిర్వాహకులు తమకు 5 రోజులు మండపాలు పెట్టుకునేందుకు అనుమతి ఇవ్వాలంటూ కొన్నేళ్లుగా పోరాడుతుండగా ఈ సంవత్సరం స్థానిక ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి చొరవతో పోలీసులు అనుమతి ఇచ్చారు. దీంతో ఈ సంవత్సరం ఐదు రోజులపాటు వినాయక మండపాలు ఉంటాయని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో విలేకరి సామేలు దుర్మరణం.



మంత్రాలయం ఆగష్టు 16 విభారె న్యూస్.మంత్రాలయం మండలంలోని మాధవరం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎమ్మిగనూరుకు చెందిన విలేఖరి సామేలు (45) దుర్మరణం చెందారు. మృతుడు తన కూతురు, కుమారుడితో కలిసి రాంపురంలో బంధువు మరణిస్తే మట్టికి వెళ్లి బైక్ పై ఎమ్మిగనూరుకు వస్తుండగా మాధవరం దగ్గర అదుపు తప్పి బైక్ పై నుంచి కిందపడ్డారు.సామేలు అక్కడికక్కడే మృతి చెందగా కూతురు, కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. కూతురు పరిస్థితి విషమంగా ఉంది.

# జగనన్న కాలనీలో బోర్ సిద్ధం



పెద్దకడబూరు ఆగష్టు 16: ౧( విభారె న్యూస్) పెద్దకడబూరు గ్రామంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో క్యూరింగ్ కోసం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో వేసిన బోర్ కు కరెంటు మోటర్ బిగించినట్లు గ్రామ సర్పంచ్ రామాంజనేయులు బుధవారం తెలిపారు. జగనన్న కాలనీలో థర్డ్ పార్టీ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టిందని, ఇందుకు అవసరమైన బోర్ ను సిద్ధం చేసినట్లు వెల్లడించారు.

# జగనన్న కు చెబుదాం ఆర్జీలను 24 గంటల లోపు పరిష్కరించాలి

## వెంకట దాస్ అసిస్టెంట్ కమిషనర్



నంద్యాల మా ప్రతినిధి ఆగష్టు 16 విభారె న్యూస్ :- . జిల్లా కలెక్టరు గారి ఆదేశాల మేరకు సచివాలయ అడ్మిన్ల కు. మరియు సచివాలయ సిబ్బందికిస్పందనజగనన్న కు చెబుదాం గ్రీవెన్సిలను వచ్చిన వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి 24 గంటల లోపు పరిష్కరించాలని అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్ సచివాలయ అడ్మిన్లకు బుధవారం తన ఛాంబర్లో సూచించారు . క్వాలిటీ ఎండార్స్ మెంట్ ను సంబందిత సెక్షన్ హెడ్స్ ద్వారా కమిషనరు గారి అప్రూవల్ తో సదరు స్పందన గ్రీవెన్సీలను క్లోజ్ చేయవలసినదిగా కోరారు . అలాగే జగనన్న కు చెబుతాం స్పందన అర్జీదారులతో ఈ కేవైసీ ని ఎప్పటికప్పుడు అర్జీదారుడితో తాంబ్ వేయించి క్లోజ్ చేయవలసినదిగా సూచించారు .సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# గడప గడపకు మన ప్రభుత్వము



పెద్దకడుబూరు ఆగష్టు16:౧ విభారె న్యూస్) పెద్దకడబూరు మండలం చిన్నతుంబళము గ్రామంలో సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధికి సంబంధించి చిన్నతుంబలము గ్రామ సచివాలయము -గడప గడపకు మన ప్రభుత్వము ఉదయము 07.00 గంటల నుండి చిన్నతుంబలము ముఖ్య అతిథిగా వై. బాలనాగిరెడ్డి (ఎం.ఎల్.ఏ.), మంత్రాలయము నియెజకవర్గము వారు సందర్శించుచున్నారు కావున పై కార్యక్రమమునకు సర్పంచు, వార్డు సభ్యులు, మండల అధ్యక్షులు,ఉపాధ్యక్షులు,జెడ్.పి.టి.సి., ఎం.పి.టి.సి., కో-ఆప్టెడ్ సభ్యులు, మండల ప్రజా ప్రతినిధులు, సింగిల్ విండో అధ్యక్షులు, మండలములోని మండల స్థాయి అధికారులందరు పంచాయతీ కార్యదర్శి, (గ్రామ సచివాలయ సిబ్బంది, (గ్రామ వాలంటీరులు మరియు పత్రికా విలేకరులందరూ తప్పకుండ హాజరు కావలసినదిగా కోరడమైనది.

# కోడుమూరు అసెంబ్లీలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి 5వ వర్ధంతి



కోడుమూరు ఆగష్టు 16 విభారె న్యూస్.భారతదేశ మాజి ప్రధాని 5వ వర్ధంతి కోడుమూరు అసెంబ్లీలో కర్నూలు రూరల్ మండలం బాలాజి నగర్ బిజెపి కార్యలయం నివాళులు ఈ కార్యక్రమంలోబిజెపి కర్నూలు రూరల్ మండల అధ్యక్షుడు బెస్త ఈరన్న ఓ బి సి మోర్చ జోనల్ ఇన్చార్జి మురళినాయుడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉల్చాలలక్ష్మణ్ నాయుడు కర్నూలు పార్లమెంట్ విస్తారక్ గోపాల్ కృష్ణశర్మ కర్నూలు మండలం ఐదవ డివిజన్ అధ్యక్షుడు మధుగౌడ్ ఆచారి కిరాణంరెడ్డి తిరుమలేష్ బిజెపి ఎస్సీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేల్పులగోపాల్ మాట్లాడుతూ భారతదేశ మాజి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్ పేయ్ యొక్క పరిపాలన విలువలకు పెట్టింది పేరు ఈరోజు దేశవ్యాప్తంగా కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు హైవేల నిర్మాణం జరిగి భారతదేశం ఇంత అభివృద్ధి చెందింది అంటే దానికి ప్రధానమైనటువంటి కారణం మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్ పేయి తీసుకున్నటువంటి కీలకమైనటువంటి నిర్ణయమే అదే విధంగా వారు హయాంలోనే మనం పాకిస్తాన్ పైన విజయం సాధించి భారతదేశ వ్యాప్తంగా ప్రజలలోనా భారతదేశ పట్ల గౌరవాన్ని పంపించినటువంటి సందర్భాన్ని మనం చూసాం ఇలా చెప్తూ పోతూ ఉంటే వారి యొక్క సేవలను మనం మాట్లాడుతూ పోవాల్సిందే వారు చేసిన సేవలకు మనమిచ్చే ఘన నివాళులు.

# అమావాస్యను పురస్కరించుకుని శ్రీ సుంకులమ్మ అవ్వకు ప్రత్యేక పూజలు.



ఎమ్మిగనూరు ఆగష్టు 16 విభారె న్యూస్.పట్టణంలోని మెయిన్ బజార్ లో వెలసిన శ్రీ సుంకులమ్మ అవ్వ దేవాలయంలో అమావాస్యను పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాతః కాలంలోనే అమ్మవారికి అభిషేకం, అర్చన, పూల అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి మహా మంగళహారతి నిర్వహించారు. అమావాస్య సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని తమ యొక్క మొక్కులను తీర్చుకోవడానికి భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులై తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. పై పూజా కార్యక్రమాలు అన్నియు ఆలయ పూజారులు నాగరాజు దంపతులు నిర్వహించారు.

# పార్కు లోని అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి

## రవి చంద్రా రెడ్డి మున్సిపల్ కమిషనర్

నంద్యాల మా ప్రతినిధి ఆగష్టు 16 విభారె న్యూస్ :- నంద్యాల పట్టణంలో ఎన్ జి ఓ కాలనీలో ఉన్న పార్కు ను. జీటి ఎస్ పనులను. నౌమాన్ నగరయందు శానిటేషన్ పనులను బుధవారం మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి పరిశీలించారు . పార్కు లోని అభివృద్ధి పనులన్నింటిని త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి అధికారులను ఆదేశించారు. పార్కును మున్సిపల్ డీఈలు మదు కుమార్. శ్రీనివాస్ రెడ్డి. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి తో కలసి ఉదయం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. పార్కు ఆవరణలో ప్రస్తుతం పేరుకుపోయిన పనికిరాని పరికరాలను ఇతర వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. శానిటేషన్ పై అశ్రద్ధ చూపవద్దని హెచ్చరించారు. కమిషనర్ వెంట సచివాలయ సిబ్బంది మున్సిపల్ సిబ్బంది ఉన్నారు



# ప్రజా సమస్యల పరిష్కారనీ కోసం అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ఆళ్లగడ్డ ప్రతినిది ఆగస్టు 16 విభారె న్యూస్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలని మండల పరిషత్ అధ్యక్షుడు గజ్జల రాఘవేంద్ర రెడ్డి అన్నారు. బుధవారం ఆళ్లగడ్డ మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉప మండల అధ్యక్షులు నాసారి ప్రసాద్, ఎంపీడీవో మహబూబ్ ఖాన్ తదితర అధికారులు పాల్గొన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ద్వారా మండలంలో పెద్ద సంఖ్యలో ఉచితంగా జనన మరణ కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలను అందజేయడం జరిగింది అన్నారు. మండల వ్యవసాయ అధికారి కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎల్నినో ప్రభావంతో వర్షపాతం నమోదు తక్కువగా ఉందన్నారు. వరి కాకుండా ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని రైతులకు సూచించడం జరిగింది అన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నేరుగా ఎరువులు విత్తనాలను అందించడం జరుగుతుందన్నారు. ట్రాన్స్కో ఏ ఈ కంబగిరి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన జగనన్న కాలనీలకు, టిడ్కో ఇళ్లకు లబ్ధిదారులకు మీటర్లను ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఎంఈఓ శోభా వివేకవతి, పశుసంవర్ధక శాఖ అధికారి, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, ఎన్ఆర్ఈజీఎస్



మండల సర్వసభ్య సమావేశం జరుగుతున్న దృశ్యం

తదితర శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి గురించి వివరించారు. చివరగా ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం అభివృద్ధి మండలంలోని గ్రామంలలో అర్హులైన లబ్ధిదారులు అందించే బాధ్యత అధికారులదేనన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రభుత్వ ఫలాలు ప్రజలకు అందుతాయి అన్నారు.

# రాయలసీమ స్వాతంత్రోద్యమ యోధులు ముత్తుకూరు గౌడప్ప,గులాం రసూల్ ఖాన్ విగ్రహాలను ఏర్పాటు చేయాలి

## రవికుమార్,రాష్ట్ర అధ్యక్షులు ఆర్వీపీఎస్.



కర్నూలు, ఆగష్టు 15 విభారె న్యూస్ :కర్నూలు:-నగరంలోని స్థానిక బిర్లా కాంపౌండ్ సర్కిల్లో నూతనంగా నిర్మిస్తున్న కూడలిలో రాయలసీమ నుండి మొట్టమొదటి స్వాతంత్ర సమరయోధులు ముత్తుకూరు గౌడప్ప,కులం రసూల్ ఖాన్ ల విగ్రహాలను ఏర్పాటు చేయాలని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్ డిమాండ్ చేశారు. నేడు బిర్లా కాంపౌండ్ వద్ద గల కూడలిలో రాయలసీమ విద్యార్థి పోరాట సమితి జిల్లా అధ్యక్షులు అశోక్ ఆధ్వర్యంలో ముత్తుకూరు గౌడప్ప,గులాం రసూల్ ఖాన్ విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరుతూ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్ మాట్లాడుతూ రాయలసీమ నుండి మొట్టమొదట అంటే 1801 ప్రాంతంలోనే తెర్నేకల్లు గ్రామంలో ముత్తుకూరు గౌడప్ప ఆధ్వర్యంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలను నడిపారని చరిత్రలో రాయలసీమ నుండి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా దేశంలోనే మొట్టమొదటి తిరుగుబాటు తెర్నేకంటి ముట్టడి ఉద్యమం కావచ్చునని పద్దెదురోజుల పాటు పోరాటానికి నాయకత్వం వహించిన వీరుడు ముత్తుకూరు గౌడప్పను బ్రిటిష్ వారు ఊరి తీసి ఊరవాకిలికి వేలాడతీయగా ఉద్యమంలో పనిచేసిన వందలాదిమందిని అంతమొందించి గ్రామంలోని కుక్కల బావిలో వేశారని చరిత్ర చెబుతుందని అలాంటి చరిత్రను కనుమరుగు చేయవద్దన్నారు అలాగే కర్నూలు వేదికగా అఖరు నవాబు అయిన రసూల్ ఖాన్ 1839 కాలంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేసి ఆ పోరాటంలోనే బంధింపబడి విషప్రయోగం వల్ల మరణించిన వీరుడని అన్నారు వారి చరిత్రను మరవకుండా ముత్తుకూరు గౌడప్ప,గులాం రసూల్ ఖాన్ ల విగ్రహాలను నగరంలో నూతనంగా నిర్మిస్తున్న బిర్లా కాంపౌండ్ కూడలిలో ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాయలసీమ విద్యార్థి పోరాట సమితి నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై సిపిఐ రాష్ట్ర సమితి నిర్వహించు బస్సు యాత్రను జయప్రదం చేద్దాం

## సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ. నాగేశ్వరరావు పిలుపు.




నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 16 విభారె న్యూస్ :-దేశాన్ని మతోన్మాదంతో పాలిస్తూ దేశంలో ఉన్న ప్రభుత్వం రంగ సంస్థలను అంబానీ అదానిలకు అమ్ముతూ వారికి ఊడిగం చేస్తున్న దేశ ప్రధాని నరేంద్ర మోడీ నుండి దేశాన్ని కాపాడుకునేందుకు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర రాజధాని ఎక్కడో వివరించకుండా పాలనను వ్యతిరేకిస్తూ సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో బస్సు యాత్ర ఆగస్టు 17న విశాఖ నగరంలోని ఉక్కు పరిశ్రమ నుండి బయలుదేరి 26 జిల్లాల పర్యటించి సెప్టెంబర్ 8వ తేదీ లక్షలాది మందితో భారీ బహిరంగ సభ తిరుపతి నగరంలో జరుగుతుంది. ఈ కార్యక్రమాలను జయప్రదం చేసేందుకు నంద్యాల జిల్లాలోని ప్రతి ఒక్క కార్యకర్త నుండి నాయకుల వరకు కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు. పిలుపునిచ్చారు.పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో బుధవారం జిల్లా సమితి సభ్యులు నరసింహులు అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు . సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే రామాంజనేయులు. ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నవరత్నాల పేరుతో ప్రజా వ్యవస్థను చిన్నా భిన్నం చేయడమే కాకుండా రాష్ట్ర రాజధాని నిర్మాణం పై సరైన సమాధానం చెప్పలేక ప్రతిపక్షాలపై దౌర్జన్యాలు చేపిస్తూ తండ్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి వారసత్వాన్ని మంట కలిపే విధంగా రాష్ట్రంలో పరిపాలన చేస్తున్నాడని ఆరోపించారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ సుంకయ్య. కే రాధాకృష్ణ. కె ప్రసాద్ శ్రీనివాసులు భాస్కర్ నాగరాముడు ధనుంజయుడు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లాఅధ్యక్ష కార్యదర్శులు నారాయణమ్మ. సుగుణమ్మ. సిపిఐ జిల్లా సమితి సభ్యులు పులి శేఖరు.నారాయణ శ్రీనివాసులు. సోమన్న సుబ్బరాయుడు ప్రసాదు.హరినాథ్ సుబ్బారెడ్డి బాలకృష్ణ రమేష్ బాబు జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# దేశ రాజకీయాలలో తనదైన శైలి లో ముద్ర వేసుకున్న నేత...కీర్తిశేషులు కోట్ల విజయభాస్కర రెడ్డి

## ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి





విభారే డోన్ ప్రతినిధి :- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రివర్యులు కీర్తిశేషులు కోట్ల విజయభాస్కరరెడ్డి గారి "జయంతి" సందర్భంగా డోన్ పట్టణంలో డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి గారు, రాష్ట్ర తెలుగుదేశంపార్టీ కార్యదర్శి వలసల రామకృష్ణ గారు టిడిపి నాయకులతో కలిసి విజయభాస్కరరెడ్డి గారి విగ్రహమునకు పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దాయన కోట్ల విజయభాస్కర రెడ్డి గారు దేశ రాజకీయాలలో తనదైన శైలి లో ముద్ర వేసుకున్న నేత గా నిలిచారని. పేదవారి ఎదుగుదలే సమాజ నిర్మాణానికి నాంది అని భావించి వారి ఎదుగుదలకు నిరంతరం కృషి చేశారని, నీతి నిజాయితీ గా, మచ్చలేని నాయకుడిగా దేశ రాజకీయాలలో గుర్తింపు తెచ్చుకున్నారని అటువంటి వ్యక్తి డోన్ నుండే ప్రాతినిధ్యం వహించడమనేది ఎంతో అదృష్టకరమని అన్నారు. తన రాజకీయ జీవితంలో ఎన్నో పదవులు అలంకరించి ఆపదవులకే వన్నె తెచ్చిన వ్యక్తి కోట్ల విజయభాస్కరరెడ్డి గారని అన్నారు. వారి పాలనా వ్యవస్థ గురించి ఎంత చెప్పినా తక్కువే అని వారు అన్నారు .ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు ప్రజావైద్యశాల బెస్తా మల్లిఖార్జున గారు, నంద్యాల జిల్లా టిడిపి కార్యదర్శి అబ్బిరెడ్డిపల్లె గోవిందు గారు,నంద్యాల జిల్లా టిడిపి బీసీ సెల్ నాయకులు మల్లెంపల్లె జయ్యన్న గారు, నంద్యాల జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు రాముడు గారు, మైనారిటీ కమిటి నాయకులు బాబులాల్ గారు, డోన్ నియోజకవర్గ టిడిపి రైతు కమిటీ అధ్యక్షులు మల్లయ్య గారు, సర్పంచ్ రామిరెడ్డి గారు, ఓం ప్రకాష్ గారు , మల్లెంపల్లె ఎస్సీ సుంకన్న గారు, డోన్ పట్టణ టిడిపి తెలుగుయువత ప్రధాన కార్యదర్శి కేబుల్ కిరణ్ గారు,జయరాముడు గారు, గోవిందరెడ్డి గారు, టైలర్ ఖాజా గారు, మిన్నెల్ల గారు, చనుగొండ్ల శ్రీరాములు గారు, ఐటిడిపి హుస్సేన్ పీరా గారు, నియోజకవర్గ టిడిపి తెలుగుయువత కమిటీ నాయకులు ప్రవీణ్ రెడ్డి గారు, యూనిట్ ఇంచార్జ్ వీరాంజనేయులు గారు,ఉడుములపాడు నాగేంద్ర గారు, డాన్ శీను గారు, ఎస్సీ సెల్ కమిటీ నాయకులు ప్రతాప్ గారు, తెలుగుయువత కమిటీ నాయకులు జగన్ గారు, చంద్ర గారు, కేబుల్ మురళీ గారు, కేబుల్ షాషా గారు, దస్తగిరి గారు× తదితరులుపాల్గొన్నారు.

# నీతి నిజాయితీకి మారుపేరు కోట్ల విజయభాస్కర రెడ్డి.

## జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు యం సుధాకర్ బాబు.





కర్నూలు ఆగష్టు 16 విభారె న్యూస్. నీతి నిజాయితీకి మారుపేరు స్వర్గీయ కోట్ల విజయభాస్కర రెడ్డి అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు యం సుధాకర్ బాబు ఆయన సేవలను కొనియాడారు. దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజి ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కర రెడ్డి 103 వ జయంతి వేడుకలను బుధవారం కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ముందుగా నాయకులు కార్యకర్తలు జిల్లా పార్టీ కార్యాలయంలో కోట్ల విజయ భాస్కర రెడ్డి చిత్ర పటమునకు, కోట్ల సర్కిల్ నందలి కోట్ల కాంస్య విగ్రహమునకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.సుధాకర్ బాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ప్రగతి పథంలో ఎన్నో మైలురాళ్లు సాధించి,పల్లె పల్లెకు తాగునీరు-సాగునీరు అందించడమే కాకుండా రోడ్లు, గృహాలు, విద్య, వైద్య, ఆరోగ్యం ప్రాధాన్యత ఇచ్చి రైతులకు భూమి హక్కు పత్రములను ఇచ్చిన ముఖ్యమంత్రి భారతదేశంలో కోట్ల విజయభాస్కరరెడ్డి మొదటి వ్యక్తి అని తెలిపారు. పేదలకు రూ.1.90 పైసలకే కిలో బియ్యం పథకం, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం ప్రవేశపెట్టిన ఘనత కోట్లకే దక్కుతుందన్నారు. రైతులకు రూ.50/- లకే విద్యుత్ అందించడమే కాకుండా, బడుగు, బలహీన వర్గాలకు శాశ్వత గృహ నిర్మాణాలు చేపట్టి, మహిళల ఆత్మ గౌరవం కోసం ఏకంగా మద్యపానాన్ని నిషేధించి, డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేసి మహిళల ఆర్థిక సాధికారతకు కృషి చేశారన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు, కె.సి. కెనాల్, ఎల్.ఎల్.సి. ఆధునీకరణ పనులకు వందల కోట్ల రూపాయలు మంజూరు చేయించారని తెలిపారు. రెండు సార్లు జిల్లా పరిషత్ చైర్మన్ గా, ఐదు సార్లు శాసన సభ్యులుగా, ఒక సారి శాసనమండలి సభ్యులుగా, ఆరు సార్లు కర్నూలు లోకసభ సభ్యులుగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు రెండు సార్లు ముఖ్యమంత్రిగా, నాలుగు సార్లు కేంద్రమంత్రిగా సేవలు అందించిన ఘనత ఆయనకే దక్కిందని సుధాకర్ బాబు ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో కర్నూలు నగర కాంగ్రెస్ అధ్యక్షులు జాన్ విల్సన్, డిసిసి ప్రధాన కార్యదర్శి కె సత్యనారాయణ గుప్త, ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు బి బతకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్ సిహెచ్ బజారన్న, కోడుమూరు ఇంచార్జ్ దామోదరం రాధాకృష్ణ, మైనార్టీ సెల్ సిటీ అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్, మహిళా కాంగ్రెస్ సిటీ అధ్యక్షురాలు ఎస్ ప్రమీల, ఎస్సీ సెల్ సిటీ అధ్యక్షులు డబ్ల్యూ సత్యరాజు, డాక్టర్ సెల్ అధ్యక్షులు అమరేంద్ర రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు యన్ చంద్రశేఖర్, కార్యదర్శులు ఎజాస్, లాజరస్ కాంగ్రెస్ నాయకులు ఉండవల్లి వెంకటన్న, సాంబశివుడు, బి సుబ్రహ్మణ్యం, రియాజ్, శివానంద్, నాగశేషు, కేశవరెడ్డి ఐ ఎన్ టి యు సి నాయకులు బిటి స్వామి, ఆనందం మహిళా కాంగ్రెస్ ఓబిసి సిటి కోఆర్డినేటర్ సాయి భార్గవి సేవాదళ్ మాధవి మైత్రి మొదలగు వారు పాల్గొన్నారు

# ఎద్దులదొడ్డి గ్రామంలో అత్యాచారం చేసిన నిందితులను అరెస్టు చేయాలంటూ ఐద్వా, కెవిపియస్ నిరసన

## అత్యాచారాలన్నా.. అభాగ్యులపై దాడులన్నా జిల్లా కలెక్టర్, ఎస్పీలకు పట్టవా..




కర్నూలు, ఆగష్టు 16 విభారె న్యూస్ : తుగ్గలి మండలం, ఎద్దుల దొడ్డి గ్రామంలో వ్యవసాయ పనులకు వెళ్లిన వివాహిత మహిళను అడ్డగించి, ఎత్తుకెళ్లి, నోట్లో బట్టలు కుక్కి, సామూహిక అత్యాచారం చేసిన ఉపేంద్ర, రామానాయుడు లను వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ కెవిపిఎస్, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో ఘటనకు నిరసనగా ధర్నా నిర్వహించారు.బుధవారం కర్నూలు నగరంలోని కొత్త బస్టాండ్ వద్ద ఉన్న సుందరయ్య జంక్షన్ లో ఎద్దుల దొడ్డి గ్రామంలో మహిళపై సామూహిక అత్యాచారం జరిపిన నిందితులను అరెస్టు చేయాలని, మహిళలపై రోజురోజుకు పెరుగుతున్న హింసను అరికట్టాలని కోరుతూ ఐద్వా, కెవిపిఎస్ సంఘాలుగా ధర్నా నిర్వహించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కే అరుణమ్మ అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి కెవిపిఎస్, ఐద్వా, ఆర్వీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎన్ అలివేలు, యం డి ఆనంద్ బాబు, సి గురు శేఖర్, వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షులు కే వెంకటరాముడు, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు శిరీష మాట్లాడారు.ధర్నాను ఉద్దేశించి వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో మహిళల పైన, దళితులపైన రోజురోజుకు దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. వాటిని నియంత్రించడంలో పాలకుల వివక్షతోపాటు అధికారుల వైఫల్యం ప్రధానంగా కొనసాగుతోందన్నారు. తుగ్గలి మండలం, ఎద్దుల దొడ్డి గ్రామంలో వ్యవసాయ కూలీగా ఉన్న దళిత మహిళలపై ఆగస్టు ఐదున అత్యాచారం చేసి, అత్యాచారాన్ని వీడియోగా చిత్రీకరించిన నిందితులు, ఘటనను బయటకు చెబితే వీడియోను బయటపెట్టి చంపుతామని బెదిరించారన్నారు. ఘటనను మనసులో పెట్టుకొని కుమిలిపోతున్న మహిళ తన భర్త సహకారంతో గత ఐదు రోజుల క్రితమే విషయాన్ని బయటకు చెప్పినా, ఇప్పటికీ కేసును నమోదు చేయలేదన్నారు. ఘటన పత్రికల ద్వారా బయటికి వచ్చిన అనంతరం ఈరోజు హడావిడిగా డి.ఎస్.పి గ్రామానికి వెళ్లారన్నారు. రెండు నెలల క్రితం ఇలాగే గోనెగండ్ల మండలం, గంజహళ్లి గ్రామంలో 13 సంవత్సరాల మైనర్ బాలికపై పాసవికంగా అత్యాచారం జరిగిందన్నారు. అత్యాచారానికి కారణమైన వాళ్ళను అరెస్టు చేయాలని గ్రామం మొత్తంగా మొత్తుకున్నా, సహకరించిన నిందితులను ఇప్పటికీ అరెస్టు చేయలేదన్నారు. ఆ బాధిత కుటుంబానికి ఎలాంటి సహకారము అందించకపోగా, చదువుకోవాల్సిన బాలికను చదువుకు దూరం చేసిన పాపం అధికారులదేనన్నారు.ఒక మహిళపై ఇద్దరు మానవ మృగాలు అత్యాచారం చేస్తే.. ఆ ఘటన బయటికి రావడానికి 11 రోజులు పట్టింది అంటే.. ఘటన బయటపడ్డాక కూడా బాధితులు అవమానపడాల్సిందే గాని నిందితులవైపే అధికారులు ఉంటున్నారనే భయంతో.. ఇలాంటి ఎన్నో ఘటనలు బయటపడకుండానే ఆగిపోతున్నాయన్నారు. ఇప్పటికైనా మహిళల పైన, దళిత, గిరిజనుల పైన అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ లు ఘటన ప్రాంతాన్ని సందర్శించి, నిందితులను అరెస్టు చేయించడంతోపాటు బాధితులకు భరోసా కల్పిస్తే.. ఇలాంటి ఘటనలప్పుడు బాధితులు ధైర్యంగా ముందుకు రావడానికి అవకాశం ఉంటుందని వారన్నారు. నిందితులైన ఉపేంద్ర, రామానాయుడులపై వెంటనే కేసు నమోదు చేయించి అరెస్టు చేయాలని లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.ధర్నా కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు డి విజయమ్మ, ఐద్వా ఓల్డ్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు రసీదా, బి పద్మ, జిల్లా ఉపాధ్యక్షులు పిఎస్ సుజాత, కే ఎస్ పద్మ, సేకున్, బద్రున్నిసా, ఉమా, కుమారి, కెవిపిఎస్ ఓల్డ్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు ఆర్ రమణ, ఆంద్రా గురుస్వామి, జిల్లా కమిటీ సభ్యులు రోషన్న తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కోట్ల విజయ భాస్కర్ రెడ్డి జయంతి



ఎమ్మిగనూరు టౌన్ ఆగస్టు 16 విభారె న్యూస్:-మాజీ ముఖ్య మంత్రి దివంగత కోట్ల విజయభాస్కర్ రెడ్డి 113వ జయంతిని స్థానిక కోట్ల క్యాంప్ కార్యాలయంలో ఆయన అభిమానులు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈసందర్భంగాపార్టీనాయకులుబనవాసి ఆదినారా యణ రెడ్డి, కదిరికోట ఆదెన్న మాట్లాడుతూ అర్ధ శతాబ్దపు రాజకీయ పయనంలో ఆయన అనేక పదవులు చేపట్టి ఆ స్థానాలకు వన్నె తెచ్చారని కొనియాడారు. రాజకీయ ప్రస్థానంలో రెండుపర్యాయాలుజిల్లా పరిషత్ చైర్మన్గాఐదుసార్లు శాసనసభ్య లుగా, ఒక పర్యాయం ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యునిగా, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ గా పదవులు చేపట్టారన్నారు. పల్లెలకు తాగు, సాగునీరు అందించడమే కాక మహిళల ఆత్మగౌరవం కోసం సారా నిషేధం,పేద ప్రజలకురూ1.90లకే కిలో బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టారు అన్నారు. ఆయన జీవితం ప్రజాసేవకే అంకితం చేశారన్నారు.ఈకార్యక్రమంలోఅల్తాఫ్,ఉప్పర ఆంజనేయులు కందనాతి శ్రీనివాసులు, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190